# గృహస్థులకు గురుదేవుల సందేశం

(శ్రీరామకృష్ణ పరమహంస ఉపదేశములు)

సంకలనము, కూర్పు
కంభంపాటి వెంకట రామగోపాలశర్మ

ప్రకాశకులు
శ్రీ రామకృష్ణ సేవా సమితి
బాపట్ల - 522101

ప్రకాశకులు
శ్రీ రామకృష్ణ సేవా సమితి
బాపట్ల - 522101

**శ్రీ చిరంతనానందస్వామి వారిచే రచించబడి**
**శ్రీ రామకృష్ణ మఠం, చెన్నై వారిచే ప్రచురించబడిన**
**"శ్రీ రామకృష్ణ బోధామృతం" ఆధారంగా**
**ఈ పుస్తకం ప్రచురించబడింది.**


| | | |
|---|---|---|
| రజతోత్సవ ప్రచురణ: | అక్టోబరు, 1995 | (1000 కాపీలు) |
| 2వ ముద్రణ : | అక్టోబరు, 2002 | (3000 కాపీలు) |
| 3వ ముద్రణ : | జనవరి, 2004 | (3000 కాపీలు) |
| 4వ ముద్రణ : | అక్టోబరు, 2004 | (3000 కాపీలు) |
| 5వ ముద్రణ : | జులై, 2005 | (5000 కాపీలు) |
| 6వ ముద్రణ : | మే, 2007 | (3000 కాపీలు) |
| 7వ ముద్రణ : | అక్టోబరు, 2007 | (3000 కాపీలు) |

ప్రతులకు:
శ్రీరామకృష్ణ సేవా సమితి
విజయలక్ష్మీపురం, బాపట్ల - 522101
E-mail : rksamithibapatla@gmail.com
Visit us at: www.unworldliness.org

# ద్వితీయ ముద్రణకు ప్రకాశకుల మనవి

గృహస్థులకు శ్రీ గురుదేవులిచ్చిన అమూల్యమైన సందేశాన్ని జనబాహుళ్యానికి మరింత చేరువగా తేవడానికి ఈ పుస్తకాన్ని మరల ముద్రించవలసిందిగా పలువురు భక్తులు కోరారు. వారి కోరిక మేరకు మా 32వ వార్షికోత్సవ సందర్భంగా ఈ పుస్తకాన్ని మరల ప్రచురించగలుగుతున్నందుకు ఎంతో ఆనందిస్తున్నాము. పాఠకుల ప్రయోజనార్థం ఈ పుస్తకంలోని బోధనలను మరింత చక్కగా అర్థం చేసుకోవడానికి ఆయా బోధనలలోని అంతరార్థాన్ని మరింత వివరిస్తున్న కథలు మా ఇంకొక ప్రచురణ అయిన 'ఒక కథ చెపుతా విను!'లో ఏయే పేర్లతో ఉన్నాయో సూచించడం జరిగింది.

బాపట్ల ప్రకాశకులు
15.10.2002
విజయదశమి

# తొలి ముద్రణకు ప్రకాశకుల మనవి

శ్రీ రామకృష్ణ సేవాసమితి రజతోత్సవ కార్యక్రమాలలో భాగంగా ఈ పుస్తకం ప్రచురించబడింది. శ్రీ రామకృష్ణుల సందేశంలో గృహస్థభక్తులకు ఉపయోగపడే కొన్ని అంశాలను క్రోడీకరించి ఒక లేఖ రూపంలో, సాధ్యమైనంత తేలికైన భాషలో అందజేయాలన్నదే ఈ పుస్తకం యొక్క ముఖ్యోద్దేశ్యం.

శ్రీ చిరంతనానందస్వామి వారిచే రచింపబడిన "శ్రీరామకృష్ణ బోధామృతం"లోని సూక్తులను వినియోగించుకోవడానికి అనుమతించిన శ్రీరామకృష్ణ మఠం, మద్రాసు వారికి మా కృతజ్ఞతాపూర్వక ప్రణామములు. ఈ పుస్తకమును రూపొందించడంలో తమ అమూల్యమైన సూచనలను అందించిన మన శ్రీరామకృష్ణ సేవాసమితి వ్యవస్థాపక కోశాధికారి పూజ్యులు శ్రీ బి.యస్.ఆర్. ఆంజనేయులుగారికి మా ప్రణామములు. తమ అమూల్యమైన సలహాలను అందించి, సహకరించిన డా. పన్నాల శ్యామసుందరమూర్తి గారికి, డా. కె.వి.యస్. ఆచార్యగారికి మా కృతజ్ఞతాపూర్వక అభివందనములు.

అనూహ్యంగా పెరుగుతున్న నాగరికత ఒత్తిడివలన దైవానికి, మానవతావిలువలకు మనిషి దూరమైపోతున్న నేటి యాంత్రిక యుగంలో గృహస్థభక్తులు తమ ఆధ్యాత్మిక సాధనలో మరొక మెట్టు ఎక్కడానికి ఈ పుస్తకం ఉపకరిస్తే మా ఈ చిన్న ప్రయత్నం సఫలమైనదని భావిస్తాము.

బాపట్ల ప్రకాశకులు

29.10.1995



శ్రీ రామకృష్ణ పరమహంస

# విషయసూచిక


గృహస్థులకు గురుదేవుల సందేశం ........ 7
ధనసంపాదన ........ 10
కుటుంబబాధ్యతలు ........ 12
మనిషిగా సాధించవలసినది ఏమిటి? ........ 17
ఉత్తమ భక్తుల లక్షణాలు ........ 20
సత్సాంగత్యం ........ 23
భగవన్నామస్మరణ, తీర్థయాత్రలు ........ 24
విగ్రహారాధన ........ 26
మానవతా విలువలు - అణకువ ........ 28
మానవతా విలువలు - నిష్కాపట్యం ........ 29
మానవతా విలువలు - వివేకం ........ 30
అహంకారం లేకపోవడం ........ 30
వివేక వైరాగ్యములు ........ 32
ఏకాగ్రత ........ 33
సాధన ........ 33
భగవంతుని మాయ, కృప ........ 39
దేవుడు ఒక్కడే, పేర్లు అనేకం ........ 41
దుర్మార్గులతో ఎలా వ్యవహరించాలి? ........ 45

# గృహస్థులకు గురుదేవుల సందేశం

ప్రియమిత్రమా,

నీ లేఖ అందింది. సుదీర్ఘమైన ఆ లేఖ నీ మనసులోని బాధకు, నీ అయోమయస్థితికి అద్దం పట్టింది. నేటి సామాజిక పరిస్థితులలో నీవంటి గృహస్థులు ఇటువంటి స్థితిని ఎదుర్కోవడం సహజమే.

ఒకప్రక్క నిత్యజీవితపు కష్టనష్టాలు, మరోప్రక్క నేటి నాగరికత ప్రభావంవల్ల కుటుంబవ్యవస్థలో ఎదురయ్యే చికాకులు గృహస్థులను క్రుంగదీస్తున్నాయి. ప్రపంచమంతా కొనియాడే మన దివ్య సంస్కృతీవైభవాన్ని నిలబెట్టుకోవాలనే తపనగల నీవంటివారు ఈ విషయంలో మరింత అశాంతికి లోనవుతున్నారు.

“భావితరాలకు మన సంస్కృతి యొక్క విలువలను వారసత్వంగా అందించడం ఎలా? మహాత్ముల దివ్య సందేశాలు జనబాహుళ్యానికి స్ఫూర్తినిచ్చే విధంగా నిరంతరం ప్రచారంలో ఉండేదెలా?” అనే విస్తృత

ప్రాధాన్యంగల ప్రశ్నలు ఒకవైపు, “వ్యక్తిగత స్థాయిలో మానవ జీవితలక్ష్యం ఏమిటి? ఆధ్యాత్మిక సాధన ఎలా? భగవంతుణ్ణి చూడడం ఎలా?” – ఇటువంటి అనేక ప్రశ్నలు మరొకవైపు వేధిస్తున్నాయని వ్రాశావు.

ఏ వృత్తిలోని వారైనా, ఏ ప్రాంతంలోని వారైనా, తమ జీవితంలో ఏదోవొక సందర్భంలో ఇలాంటి సందేహాలను నీలాగా ఎదుర్కొనక తప్పదు. అటువంటి సందేహాలను తీర్చి, మనిషి జీవితాన్ని సార్థకం చేయగల ఎన్నో మంచి సూచనలు, సూక్తులు శ్రీరామకృష్ణుల దివ్యసందేశంలో మనకు లభిస్తాయి.

ఆధునిక నాగరికత ప్రారంభదశలో శ్రీరామకృష్ణులు ఒక పేదకుటుంబంలో జన్మించి; బాల్యం నుండి అద్భుతమైన పారమార్థిక చింతనతో కఠోరమైన సాధనలు చేసి ఆ జగజ్జననిని సాక్షాత్కరించుకొన్నారు. అన్ని మతాలలోని సాధనలను ఆచరించి, ఆయా మతాలలోని మహాపురుషుల సాక్షాత్కారాన్ని పొందారు. సృష్టి అంతటా దైవం ఉన్నాడనీ, అన్ని మతాలూ ఆయనను చేరే వేర్వేరు మార్గాలనీ చాటి చెప్పారు. ఆ విధంగా, “ఎవడు రాముడో, ఎవడు కృష్ణుడో అతడే ఈ శరీరమున శ్రీరామకృష్ణుడు!” అని స్వయంగా తన

అవతార రహస్యాన్ని వెల్లడించి; భక్తజనుల ఆధ్యాత్మిక సాధనలు చేసే విధానాన్ని, మోక్షానికి మార్గాన్ని చూపిన అవతారవరిష్ఠులు శ్రీరామకృష్ణులు. గృహస్థుగా ఉన్నప్పటికీ, బ్రహ్మచర్యదీక్షతో ఆధ్యాత్మిక సాధనలు చేసి, మనిషి తన దివ్యత్వాన్ని ఎలా తెలుసుకొని, వ్యక్తీకరించుకోవాలో ఆచరణలో చూపిన మహాచార్యులు శ్రీరామకృష్ణులు.

మిత్రమా! దైవచింతన, నైతికవిలువలు, ఆధ్యాత్మికత వంటి ఉన్నతభావాలను అర్థం చేసుకోలేని కొందరు, “అవి ఇతరులకు సంబంధించినవిగాని, మనకు సంబంధించినవి కావు” అని నిర్లిప్తంగా ఉంటారు. అటువంటివారి అజ్ఞానాన్ని పోగొట్టి, వారిలో మంచి నడవడికను పెంపొందించి, క్రమంగా దివ్యత్వం వైపు నడిపించడం కోసం ఆణిముత్యాలవంటి ఎన్నో సూక్తులను శ్రీరామకృష్ణులు అనుగ్రహించారు. ఆయన సూక్తులు పండితులకే కాక పామరులకు కూడా చక్కగా అర్థమౌతాయి. ఆ సూక్తులలో కొన్నింటిని నీకోసం నేనిక్కడ పొందుపరుస్తున్నాను. ప్రశాంతమైన మనస్సుతో, చిత్తశుద్ధితో వీటిని చదివి అర్థం చేసుకుని, ఆచరిస్తే నీ సందేహాలు తేలికగా తొలగి, నీకు ఆధ్యాత్మిక జ్ఞానపు వెలుగు తప్పకుండా కనబడుతుంది.

ముందుగా ధనం సంపాదించడాన్ని గురించి, సంసార బాధ్యతల నిర్వహణను గురించి నీ సందేహాలకు సమాధానం తెలిపే కొన్ని సూక్తులను తెలియచేస్తాను.

## ధనసంపాదన

ప్రపంచంలో మనిషి జీవించడానికి ధనం అవసరమే! కాని దానిని గురించి అదేపనిగా ఆలోచించకుండా దొరికిన దానితో తృప్తిపడడం మంచిది. 'ధనం కూడబెట్టడం ఎలా?' అని ఆందోళన పడవద్దు. ఎవరు తమ మనస్సును, ప్రాణాన్ని భగవంతునికే అర్పించి ఆయనను శరణువేడతారో, వారికి ప్రాపంచిక విషయాలపై ఆసక్తి ఉండదు. అటువంటివారు చేసే ఖర్చు వారి ఆదాయానికి తగినట్టుగా ఉంటుంది. ఒకవైపు ధనం చేతికి వస్తూ ఉంటే మరోవైపు ఖర్చవుతూ ఉంటుంది." (అంటే వారు ధనం కూడబెట్టడంలో ఆసక్తి చూపరని భావింపవచ్చు.)

ఒక గృహస్థుని ప్రశ్న: "అయ్యా, ఇప్పటికంటే ఎక్కువగా డబ్బు సంపాదించాలని నేను ప్రయత్నించవచ్చా?"

గురుదేవులు: "తప్పకుండా! వివేకంతో దానిని నీ కుటుంబ పోషణకే వినియోగించదలిస్తే అందుకు ప్రయత్నించవచ్చు. అయితే అందుకోసం న్యాయమైన మార్గాన్ని మాత్రమే

అవలంబించాలి సుమా! ఎందుకంటే నీ ఆశయం భగవంతుణ్ణి సేవించడమే కానీ ధనార్జన కాదు.”

ఒక గృహస్థుని ప్రశ్న: “అయ్యా, కుటుంబ విషయంలో నా బాధ్యత ఎంతవరకు ఉంటుంది?”

శ్రీగురుదేవులు: “కుటుంబపోషణకు ఇబ్బంది లేకుండా తగిన సౌకర్యం కల్పించేంతవరకూ నీకు బాధ్యత ఉన్నది. కానీ నీ పిల్లలు తమను తాము పోషించుకునే స్థితికి వస్తే, అపుడు వారి విషయంలో నీకిక ఎలాంటి బాధ్యత ఉండదు.”

“డబ్బు అనేది అన్నవస్త్రాలను, ఇంటిని సంపాదించుకోవడానికి, దైవపూజకు, భక్తులను, సాధువులను సేవించడానికి కేవలం ఒక సాధనమని మాత్రమే భావించాలి.”

ఒక భక్తుని ప్రశ్న: “ఏనాటికానాడు భుక్తికోసం పాటుపడవలసిన నేను పారమార్థిక సాధనలను ఎలా సాగించగలను?”

శ్రీగురుదేవుల జవాబు: “ఎవరికోసం నీవు భక్తితో పాటుపడతావో అతడే నీ అవసరాలను తీర్చగలడు. నిన్ను ఈ లోకానికి పంపే ముందే భగవంతుడు నీ పోషణకు తగిన ఏర్పాటు చేసి ఉంటాడు.”

ఇక సంసార బాధ్యతల నిర్వహణను గురించి శ్రీరామకృష్ణులు ఏమి చెప్పారో చూద్దాం.

## కుటుంబబాధ్యతలు

- "భగవంతుని మీద మనస్సును నిలపాలంటే గృహస్థులు ఏకాంతంలో అప్పుడప్పుడు నివసించడం అవసరం. ఆ ప్రదేశం మనుష్య సంచారానికి దూరంగా ఉండాలి. అటువంటి ప్రదేశంలో మూడురోజులు గాని, కనీసం ఒకరోజుగాని ఒంటరిగా ఉండి ఆధ్యాత్మిక సాధన చెయ్యాలి."
- "ఒకరిద్దరు సంతానం కలిగిన తరువాత భార్యాభర్తలు ఇద్దరూ అన్నాచెల్లెళ్ళలా మెలగుతూ, ఆత్మనిగ్రహంతో పరిశుద్ధమైన జీవితాన్ని గడపడానికి కావలసిన బలాన్ని ప్రసాదించమని భగవంతుణ్ణి ప్రార్థించాలి – ఇదే గృహస్థులు అనుసరించవలసిన మార్గం."
- "పడవ నీటిలో ఉండవచ్చు కానీ నీరు పడవలో ఉండకూడదు కదా! అదే విధంగా సాధకుడు సంసారంలో ఉండవచ్చు కానీ సంసారం అతనిలో ఉండకూడదు."

- "నువ్వు గృహస్థువైనంత మాత్రాన దేవుణ్ణి పొందలేనేమోనని భయపడవలసిన అవసరం లేదు. నీ మనస్సును మాత్రం భగవంతునిపై నిలిపితే చాలు. నీవు ఒక చేతితో సంసారబాధ్యతలను నెరవేరుస్తూ, రెండవ చేతితో పరమేశ్వరుని పాదాలను పట్టుకొని శరణు వేడాలి. సంసార విధులను పూర్తిచేసిన తర్వాత రెండు చేతులతో ఆయన పాదపద్మాలను హృదయానికి హత్తుకోవాలి."
- "తగిన వివేకం, వైరాగ్యం, దృఢమైన భగవద్భక్తి ఉంటే నీవు సంసారంలో ఉన్నా ఫర్వాలేదు."
- "సర్వం భగవంతునికి సమర్పించి, ఆత్మార్పణం చేసుకున్నప్పుడు అంతా ఆయన ఇష్టప్రకారమే జరుగుతున్నదని నీవు గ్రహించగలవు." [1]
- "గృహస్థులు కూడ భగవత్సాక్షాత్కారాన్ని పొందవచ్చు. జనకమహారాజుని అందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. కాని ఒక్కసారిగా మనం ఆయనలాగా తయారుకాలేము. ఆయన లోకవ్యవహారాలకు దూరంగా, ఏకాంతంగా ఉండి ఎన్నో సంవత్సరాలు కఠోర సాధన చేశారు. అందువలన, గృహస్థులు కూడా అప్పుడప్పుడు ఏకాంత ప్రదేశంలో ఉంటూ భగవంతుని సాక్షాత్కారం కోసం

ఆర్తితో సాధన చేయడం అవసరం.”[2]

“ఏ ఆరాటమూ లేకుండా సంసారంలో నడుచుకోదలిస్తే ఏకాంతంలో ఎంతోకొంత కాలం భక్తిసాధన చేయాలి. అక్కడ నిరంతరం భగవంతుణ్ణి ధ్యానిస్తూ, నిర్మలమైన భక్తిని ప్రసాదించమని ప్రార్థించాలి. ఈ ప్రపంచంలో ‘నీది’ అనుకొనదగినది ఏదీలేదనే విషయాన్ని ఎప్పుడూ గుర్తు చేసుకుంటూ ఉండు! నీవారనుకొనే వారందరూ ఎప్పుడో ఒకప్పుడు నిన్ను విడిచిపోయేవారేననీ, భగవంతుడొక్కడే నీవాడనీ, నీ సర్వస్వమనీ, నీ పెన్నిధి అనీ భావిస్తూ, ‘ఆయనను పొందడం ఎలా?’ అని ఎల్లప్పుడూ ఆలోచిస్తూ ఉండు!”

“పనసపండును ఒలవడానికి ముందు చేతులకు నూనె రాసుకుంటే, ఒలిచేటప్పుడు దాని జిగురు చేతికి అంటదు కదా! అదే విధంగా భక్తిజ్ఞానాలను రక్షగా పొందినప్పుడు సిరిసంపదలు, సంసార వ్యామోహం నిన్నెంత మాత్రమూ బాధించలేవు.”

“అయస్కాంతపు దిక్సూచి ఎల్లప్పుడూ ఉత్తర దిశను చూపించడంవల్ల ఓడ దారి తప్పిపోకుండా ప్రయాణిస్తుంది. అలాగే మనిషి హృదయం భగవంతునివైపు త్రిప్పబడి

ఉన్నంతవరకూ అతడు సంసార సాగరంలో దారితప్పకుండా ముందుకు సాగిపోగలుగుతాడు.”

☛ “ఒక స్తంభాన్ని పట్టుకొని చిన్నపిల్లలు నిర్భయంగా దానిచుట్టూ గిరగిరా తిరుగుతారు. అలాగే భగవంతునిపై మనస్సు నిలిపి తన సాంసారిక బాధ్యతలను నెరవేర్చే వ్యక్తికి ఏ అపాయమూ కలుగదు.”

☛ “పల్లెటూళ్ళలోని యువతులు నాలుగైదు కుండలను ఒకదానిమీద ఒకటి దొంతరగా తలమీద పెట్టుకొని నీళ్ళు తెచ్చుకొంటూ దోవలో తమ కష్టసుఖాలు ముచ్చటించు కొంటారు. అయినా, ఆ కుండలనుండి ఒక్క నీటిచుక్క కూడా తొణకదు. ధర్మమార్గంలో జీవించేవ్యక్తి కూడా అదే విధంగా ఉండాలి. ఎట్టి పరిస్థితులలోనూ అతడి మనస్సు ధర్మ మార్గాన్ని తప్పకుండా చూసుకోవాలి. అందుకోసం అతడు ఎల్లప్పుడూ మెలకువగాను, అప్రమత్తంగానూ ఉండాలి.”

☛ “ధనవంతుల ఇళ్ళలో వారి బిడ్డలను పెంచే దాసి తన యజమాని బిడ్డను తన సొంతబిడ్డ అని చూసేవారు భ్రమపడే విధంగా పెంచుతుంది. అయినా ఆ బిడ్డపై తనకు ఏ అధికారము లేదని ఆమెకు తెలుసు. అలాగే మనం కూడా మన బిడ్డలకు కేవలం పోషకులుగా మాత్రమే ఉండాలి.”[3]

"బిచ్చగాడు ఒక చేతితో తంబూర మీటుతూ, మరొక చేతితో చిడతలను మ్రోగిస్తూ, నోటితో పాడుతూ తిరుగుతూ ఉంటాడు. అలాగే సంసారి కూడా ఒకవంక రెండు చేతులతో సంసారవిధులను నిర్వర్తిస్తూనే, నిండు మనస్సుతో భగవన్నామ సంకీర్తన చేస్తూ ఉండాలి." [4]

"బుద్ధి, హృదయం పూర్తిగా వికసించిన వ్యక్తి ధన్యజీవి. అతడు ఎక్కడ ఏ పరిస్థితిలో ఉన్నా ప్రశంసనీయంగా ప్రవర్తించగలడు. దైవంపట్ల అతడు నిర్మలమైన భక్తిభావాన్ని కలిగి ఉంటాడు. లోకవ్యవహారాల లోను, పండితసభలలోను, వాదప్రతివాదాలలోను అతడు నైపుణ్యాన్ని ప్రదర్శించగలడు. తల్లిదండ్రులపట్ల విధేయత, బంధుమిత్రులపట్ల ఆప్యాయత; ఇరుగుపొరుగువారి పట్ల దయాదాక్షిణ్యాలు; భార్యాబిడ్డలపట్ల అనురాగం చూపగలిగినటువంటి పురుషుడే నిజమైన ధన్యజీవి."

మిత్రమా! చిన్నచిన్న మాటలలో గొప్ప అర్థాన్ని ఇమిడ్చిన ఈ సూక్తులను చదువుతుంటే నీ ఆలోచనలకు ఒక దారీతెన్నూ కనబడుతోంది అనుకుంటాను.

ఇక మనిషిగా నీవు సాధించవలసింది ఏమిటో, అందు కోసం ముందుగా దేని మీద దృష్టి నిలుపవలసి ఉంటుందో

తెలిపే కొన్ని అమృతవాక్కులను ఇక్కడ ఉదహరిస్తున్నాను. వాటిని శ్రద్ధగా చదివితే నీ కర్తవ్యం మరింత స్పష్టమవుతుంది.

## మనిషిగా సాధించవలసినది ఏమిటి?

- "మొదట ఆత్మలాభాన్ని పొంది, ఆ తరువాత ధనసంపాదన కోసం ప్రయత్నించాలి. ఈ వరుసను మార్చకూడదు. పరమార్థాన్ని సాధించిన తరువాత సంసార బాధ్యతలు నిర్వహిస్తే నీ మనశ్శాంతికి భంగం కలగదు."
- "క్రొత్తగా పట్టణానికి వచ్చిన వ్యక్తి తాను ఉండడానికి తగిన వసతి ఏర్పాటు చేసికొని సామాన్లు భద్రపరచుకొన్న తరువాతనే స్వేచ్ఛగా నగరసందర్శనం చేయగలడు. అలాగే ఈ లోకంలో మనం నిత్యశాంతినిలయుడైన భగవంతుని ఆశ్రయాన్ని ముందుగా సంపాదిస్తే, ఆ తరువాత నిత్యకృత్యాలు చూసుకొంటూ సంసార బాధ్యతలను నిర్భయంగా నిర్వహించవచ్చు."

అన్నట్లు, మిత్రమా! భగవంతుడు లేడని కొందరు చేసే ప్రచారాల వల్ల నీవు సందేహాలకు లోనుకావచ్చు. కానీ ఈ విషయంలో శ్రీ గురుదేవుని బోధనలు చదివితే దేవుడి

విషయంలో, దైవభక్తియొక్క ఆవశ్యకత విషయంలోను నీకున్న సందేహాలు తేలికగా తొలగిపోతాయి. అప్పుడు దైవసాక్షాత్కారం కోసం చేసే సాధన గురించి కూడా తగిన అవగాహన ఏర్పడుతుంది.

"రాత్రి సమయంలో కనబడే నక్షత్రాలు పగటి సమయంలో కనబడనంత మాత్రాన, అవి లేనేలేవని అనలేము కదా! అలాగే అజ్ఞానదశలో ఉండి, చూడలేని కారణంగా భగవంతుడే లేడని అనకూడదు."

ప్రశ్న: "అంతటా వ్యాపించి ఉండే భగవంతుడు మనకెందుకు కనపడడు?"

జవాబు: "కోనేటి గట్టుమీద నుండి చూచే వ్యక్తికి పైన తేలుతున్న పాచి వలన నీరు కనపడదు. ఆ నీటిని చూడదలచుకుంటే పాచిని ముందుగా తొలగించాలి. అదే విధంగా మాయ అనే పొరతో కప్పివేయబడిన కన్నులకు దేవుడు కనబడడు. ఆ పొరను తొలగించుకున్నప్పుడే ఆ దైవాన్ని చూడగలం."

"దుర్లభమైన ఈ మానవజన్మను పొందిన తర్వాత కూడా, ఇదే జన్మలో భగవంతుని తెలుసుకొనడానికి ప్రయత్నించకపోతే ఆ జీవితం వ్యర్థం."

- "సముద్రంలో గల ముత్యాలను సంపాదించాలని నిశ్చయించుకొంటే ప్రాణాపాయాన్ని లెక్కచేయకుండా అట్టడుగుకు మునిగి వెదకాలి. ఒకసారి మునిగి ప్రయత్నించిన వెంటనే అవి లభించకపోతే ఇక ముత్యాలే లేవని నిర్ధారించలేము కదా! అలాగే అన్నిచోట్లా ఉండే భగవంతుణ్ణి కనుగొనడంలో ఒక ప్రయత్నం విఫలమైనా నిరుత్సాహపడక పట్టుదలతో మరల మరల ప్రయత్నిస్తే భగవద్దర్శనం తప్పక లభిస్తుంది." [5]
- "ఒకటికి ప్రక్కన సున్నాలు చేర్చి దాని విలువను ఎంతైనా పెంచవచ్చు. కాని ఆ ఒకటిని కొట్టివేస్తే సున్నాలకు విలువ ఉండదు. అదే విధంగా అద్వితీయుడైన భగవంతుణ్ణి ఆశ్రయించని జీవునికి విలువ లేదు. లోకమంతటికీ ఆధారమయినవాడు, అన్నింటికీ విలువ కలుగజేసేవాడయిన ఆ భగవంతుణ్ణి ఆశ్రయించి, ఆయన కోసం పనిచేస్తున్నంత వరకూ జీవునికి పురోభివృద్ధి ఉంటుంది. అలాకాక సొంత ప్రతిష్ఠను పెంచుకోవాలని ప్రయత్నించడం వ్యర్థం."
- "చమురు లేనిదే దీపం వెలగనట్లే, నారాయణుడు లేనిదే నరుడు జీవించలేడు."

- "దైవభక్తి లేకపోవడమే మనిషిపడే అన్ని బాధలకు మూలకారణం."
- "ఈ కలియుగంలో భగవంతునిపట్ల భక్తి చూపకుండా చేసే పని పునాదిలేని గోడవంటిది. ముందుగా భక్తిని అలవరచుకొని ఆ తరువాత నీకిష్టమయిన పనిని ప్రారంభించవచ్చు."

కాబట్టి నేస్తం, దైవభక్తి ఎంత అవసరమో, ఆ దైవం కోసం భక్తితో సాధన చేయడం ఎంత ఆవశ్యకమో నీకర్థమయింది కదా! ఆ దైవాన్ని దర్శించాలంటే ముందుగా నీవు చిత్తశుద్ధి గల, ఉత్తమ భక్తుడివై ఉండాలి. నీ సాధనలో ఎదురయ్యే ఇబ్బందులను దృఢమైన దీక్షతో తట్టుకోవాలి. ఉత్తమ భక్తుల లక్షణాలు, వారి సాధనకు కావలసిన సాధనాలు; ఆ సాధనలో ఎదురయ్యే అడ్డంకుల విషయంలో శ్రీరామకృష్ణులు చెప్పిన సూక్తులను తెలుసుకొని ఆచరిస్తే నీ ఆధ్యాత్మిక సాధన సులువు అవుతుంది.

## ఉత్తమ భక్తుల లక్షణాలు

- "చెకుముకిరాయి నీటిలో ఎంతకాలం ఉన్నా అగ్నినిచ్చే తన లక్షణాన్ని పోగొట్టుకోదు. అది ఎప్పుడైనా

నిప్పు పుట్టించగలదు. అలాగే సమస్తదోషాలూ ఉన్న వాతావరణంలో బ్రతుకుతున్నా, ఉత్తమభక్తుడు భగవంతుని పట్ల భక్తి విశ్వాసాలు పోగొట్టుకోడు. అతడు భగవన్నామాన్ని వినగానే భక్తిపారవశ్యాన్ని పొందుతాడు."

- "సరుకులతో నింపబడిన రైలువ్యాగన్ల వరుసను ఇంజను ఒక్కటే లాగగలదు. అలాగే భగవంతునికి ప్రియతములైన ఉత్తమభక్తులు, ఎన్ని కష్టాలు ఎదురైనా భరిస్తూ, తమ జీవనయాత్రను తేలికగా సాగించగలరు. వారు తమతో పాటు మరికొందరిని కూడా ధర్మమార్గంలో దైవసాన్నిధ్యానికి తీసికొనిపోగలరు."

- "నిరుపయోగమైన తేలిక పదార్థాలను విడిచిపెట్టి, ఉపయోగపడే బరువైన పదార్థాలనే తనలో నిలుపుకొనే 'చేట'లాగా ఉత్తమభక్తులు కూడా మంచిచెడులపట్ల తగిన విచక్షణతో ప్రవర్తిస్తారు."

- "ప్రవహించే నీరు కొన్నిచోట్ల సుడులు తిరిగినా, వెంటనే వాటిని అధిగమించి ముందుకు సాగిపోతుంది. అలాగే తన హృదయం తరచుగా నిరాశ, దుఃఖం, అవిశ్వాసం వంటి సుడులలో చిక్కుకొన్నప్పటికీ, అవి తాత్కాలికమేనని గ్రహించి భక్తుడు ముందుకు సాగాలి."

- “భగవంతుని పేరు వినగానే శరీరం పులకించి, కన్నుల వెంట ఆనందాశ్రువులు రాల్చే భక్తునికి పునర్జన్మ ఉండదు.”

- “ఎవ్వరూ లేని ఏకాంతస్థలంలో కూడా పరాత్పరుడు తనను గమనిస్తున్నాడని గ్రహించి పాపకార్యాల నుండి దూరంగా ఉండగలిగేవాడే నిజమయిన పారమార్థికుడు.”

- “ఇతరులెవ్వరూ చూడడం లేదనే ధైర్యంతో, అడవి మధ్యలో ఒంటరిగా ఉన్న ఒక అందమైన యువతి, తనవైపు కామదృష్టితో చూచినా, భగవంతునిపట్ల తనకు గల భయభక్తులవల్ల ఆమెకు దూరంగా ఉండగలిగినవాడే నిజమయిన పారమార్థికుడు.”

- “ఎవ్వరూలేని ఇంట్లో కనబడిన డబ్బుసంచీని దొంగిలించాలనే దురాశకు లొంగనివాడే నిజమయిన పారమార్థికుడు.”

- “లోకులేమనుకుంటారో అనే భయంతో దానధర్మాలు చేసేవాడు, గొప్పకోసం ఆడంబరంగా పనులు చేసేవాడు పారమార్థికుడు కాడు.”

మిత్రమా! ఇన్ని మంచి లక్షణాలు గల భక్తుడిగా, పారమార్థికుడిగా ఉండగలగడం కష్టసాధ్యమే. ఆ ఉత్తమ

లక్షణాలలో కొన్ని పొందగలిగినా మనం ధన్యులమే. ఆ ధన్యత్వం సాధించాలంటే సజ్జనసాంగత్యం కూడా ఎంతో అవసరం. దానిని గురించి శ్రీ గురుదేవులిచ్చిన సందేశం ఇలా ఉన్నది.

## సత్సాంగత్యం

- "సత్సాంగత్యం ఆత్మవికాసానికి ఎంతో అవసరం."
- "ఒక వ్యక్తి కష్టపడి ఎండుచితుకులు పోగుచేసి మంట వేస్తే దాని దగ్గర అనేకమంది చలి కాచుకుంటారు. అలాగే తీవ్రమైన జపతపాలతోను, సాధనతోను ఈశ్వరసాక్షాత్కారం పొందిన మహనీయులవద్దకు చేరి వారి ఉపదేశాన్ని గ్రహించి అనుసరించడం ద్వారా అనేకమంది తమ మనస్సులను భగవంతుని మీద లగ్నం చేసుకోగలుగుతారు."
- "న్యాయవాదిని చూడగానే న్యాయస్థానం మనస్సులో మెదిలినట్లే ఉత్తమభక్తులను చూడగానే ఆధ్యాత్మికపరమయిన ఆలోచనలు, దైవచింతన కలుగుతాయి."
- "కమ్మరివాడు గాలి ఊది కొలిమిలో నిప్పును మరింత రగిలించినట్లే, మనం కూడ మన మనస్సును సత్సాంగత్యం ద్వారా నిర్మలంగాను, ప్రశాంతంగాను ఉంచుకోవాలి."

అయితే, మిత్రమా! కేవలం భక్తిపరులయిన సజ్జనులతో స్నేహమొక్కటే సరిపోదు. నీవంతు కర్తవ్యంగా భగవన్నామస్మరణ, తీర్థయాత్రలు చేయడంవంటివి కూడా అవసరమే. ఈ విషయంలో శ్రీ రామకృష్ణులేమని సెలవిచ్చారంటే:

## భగవన్నామస్మరణ, తీర్థయాత్రలు

- "కొండంత దూది కూడా రవ్వంత నిప్పుతో కాలి బూడిద అయినట్లే పవిత్రమయిన భగవన్నామ స్మరణతో పాపపు రాశులన్నీ పటాపంచలవుతాయి."
- "చెట్టుక్రింద నిలబడి చప్పట్లుకొడితే పక్షులు పారిపోయినట్లే, చప్పట్లు చరుస్తూ, హరినామ స్మరణ చేస్తే శరీరమనే చెట్టునుండి పాపాలనే పక్షులు ఎగిరిపోతాయి."
- "పవిత్రమయిన భగవన్నామం యొక్క ప్రభావం పట్ల పూర్తివిశ్వాసంతో నిరంతరం నామస్మరణ చేసే భక్తుడికి సందేహాలన్నీ తొలగి, మనస్సు నిర్మలమై చివరికి దైవసాక్షాత్కార భాగ్యం లభిస్తుంది."
- "కొన్ని రోగాల నివారణకు పైకి మందు పూయడంతో పాటు లోపలికి కూడా మందు తీసుకోవాలి. అలాగే

సంసారబాధలనే రోగనివారణకు భగవన్నామాన్ని వినడంతో పాటు సంకీర్తన చేయడం కూడా అవసరమే.”

- “ఆవుపాలు రక్తం ద్వారా దాని శరీరమంతా వ్యాపించి ఉన్నా, అవి దాని చెవుల ద్వారా, కొమ్ములద్వారా కాక, పొదుగు ద్వారా మాత్రమే లభిస్తాయి. అలాగే భగవంతుడు సర్వాంతర్యామి అయినా పవిత్రమైన దేవాలయాలలోనే ఆధ్యాత్మికానుభూతి సులభంగా లభిస్తుంది. ఎందరో మహాభక్తుల జీవితాలవల్ల, వారి పారమార్థిక సాధనలవల్ల ఆ దేవాలయాలు పవిత్రమై ఉండడమే ఇందుకు కారణం.”

- “భగవత్సాక్షాత్కారాన్ని కోరి ఎందరో మహా పురుషులు చాలాకాలం జపతపధ్యానాలు, ప్రార్థనలు, పూజలు నిర్వహించిన చోట భగవంతుడు తప్పకుండా ఉంటాడు. ఆ సాధకుల పారమార్థిక భావాలు ఆ ప్రదేశంలో నిండి ఉంటాయి. ఆ పుణ్యస్థలంలో మానవుడు ఆత్మప్రబోధం పొంది భగవంతుణ్ణి సులువుగా చూడగలుగుతాడు.”

- “నీరు ఎక్కడ త్రవ్వినా దొరుకుతుంది. కాని బావిలోగాని, సరస్సులోగాని త్రవ్వకుండానే సులువుగా లభిస్తుంది కదా! అలాగే భగవంతుడు అంతటా ఉన్నా

ముఖ్యంగా పుణ్యక్షేత్రాలలో సులభంగా అందుబాటులో ఉంటాడని గ్రహించాలి.”

అన్నట్లు నేస్తం! నీ లేఖలో విగ్రహారాధన గురించి కొన్ని సందేహాలు వ్యక్తం చేశావు. ఈ విషయంలో శ్రీరామకృష్ణుల బోధన వింటే నీ సందేహాలు ఇట్టే తీరిపోతాయి.

## విగ్రహారాధన

“భవనం నిర్మాణం చేసే సమయంలో కర్రలతో కట్టిన పరంజా ఆ నిర్మాణం అయిపోయిన తర్వాత నిరుపయోగ మవుతుంది. అలాగే ఒక సాధకునికి విగ్రహారాధన చెయ్యడం ప్రారంభదశలో మాత్రమే అవసరం. దైవసాక్షాత్కారం లభించిన తరువాత దాని అవసరం ఉండదు.”

“లక్కపండును, లక్కఏనుగును చూడగానే నిజమైన పండు, నిజమైన ఏనుగు గుర్తుకు వస్తాయి. అదే విధంగా సాధకునికి విగ్రహాలను చూడగానే నిరాకారమైన, నిత్యమైన బ్రహ్మం గుర్తుకు వస్తుంది.”[6]

“చిన్నపిల్లలు దస్తూరీ నేర్చుకొనే సమయంలో మొదట అక్షరాలను వంకరటింకరగా, పెద్దవిగా వ్రాస్తారు. ఆ తరువాత అభ్యాసం చేయగాచేయగా దస్తూరీ మెరుగుపడి

చక్కగా వ్రాయగలుగుతారు. అలాగే విగ్రహంపై మనస్సు నిలిపి ముందు ఏకాగ్రత సంపాదించాలి. ఆ తరువాత నిరాకార బ్రహ్మంపై మనస్సు తేలికగా నిలుపవచ్చును."

"ఒక విలుకాడు మొట్టమొదట పెద్దపెద్ద వస్తువులను గురిచూచి కొట్టడం నేర్చుకుంటాడు. అందులో నైపుణ్యాన్ని సాధించిన తరువాత చిన్నచిన్న వస్తువులను సులభంగా కొట్టగలుగుతాడు. అదే విధంగా ఒక స్పష్టమైన ఆకారం ఉన్న విగ్రహం మీద మనస్సును లగ్నం చేయడం నేర్చుకొన్న తరువాత నిరాకార బ్రహ్మం మీద మనస్సును నిలపడం సులభమవుతుంది.

"సాధకునికి ప్రారంభదశలో విగ్రహాలు అవసరమే. ఆత్మవికాసాన్ని సాధించడంలో వివిధ దశలలో ఉన్న వారికోసం రకరకాల పూజాపద్ధతులు ఏర్పరచబడ్డాయి.

"తాను పూజించే దేవతావిగ్రహాలు నిజంగా దివ్యత్వానికి ప్రతిరూపాలని గట్టిగా నమ్మే భక్తుడు, వాటి మూలంగా దైవసాక్షాత్కారాన్ని పొందగలుగుతాడు. కానీ వాటిని కేవలం మట్టిగానో, రాళ్ళుగానో అని భావిస్తే అందువల్ల ప్రయోజనమేమీ ఉండదు."

"ఆధ్యాత్మిక సాధనలో విగ్రహారాధన మొదటి మెట్టు

వంటిదే అయినా, భక్తుడు తనకోసమే అవన్నీ చేస్తున్నాడని తెలిసిన ఆ భగవంతుడు ఆ ఆరాధనను ఆనందంగా స్వీకరిస్తాడు.”

పైన తెలిపిన సూక్తులు విగ్రహారాధనలో దాగిన అర్థాన్ని ఎంత చక్కగా వివరించాయో గమనించావు కదా, మిత్రమా! ఇక నీవు ప్రస్తావించిన మరో ముఖ్యమైన విషయం – మానవతా విలువల పతనం! దీన్ని గురించి నీవు వ్యక్తం చేసిన ఆవేదన సహేతుకమైనదే. ఈ సందర్భంలో మానవతా విలువలంటే ఏమిటి? మనిషి జీవితాన్ని సార్థకం చేయగల ఆ మానవతా విలువలు ఎలా ఉండాలి? అన్న విషయాలపై శ్రీరామకృష్ణుల విశిష్టబోధనలను నీవు తెలుసుకొనడం చాలా అవసరం.

## మానవతా విలువలు - అణకువ

- “పండ్లతో బరువెక్కిన చెట్లు నేలకు వంగి ఉన్నట్లే; గొప్పవాడు కాదలచుకొన్న వ్యక్తి వినయం, అణకువ కలిగి ఉండాలి.”

- “వినయం అంటే తనను తాను పురుగుకన్నా హీనంగా భావించుకొనడం కాదు. అలాంటి దీనభావాన్ని, నిరాశను మనస్సులోనికి రానివ్వకూడదు. అవి మనిషి పురోభివృద్ధికి శత్రువులు.”

"త్రాసులో ఎక్కువ బరువుగల పళ్ళెం క్రిందికి వంగి, తేలికైన పళ్ళెం పైకిలేస్తుంది. అలాగే నిపుణుడు, సమర్థుడు అయిన వ్యక్తి అణుకువ, వినయం కలిగి ఉంటాడు. మూర్ఖుడు అహంకారంతో మిడిసిపడుతూ ఉంటాడు."

"ఆత్మశక్తిని ప్రకటించడానికి ప్రదర్శించే గర్వం, గర్వం కాదు. ఆత్మగౌరవాన్ని అణచివేసే వినయం, వినయం కాదు."

## మానవతా విలువలు - నిష్కాపట్యం

"కపటం లేకుండా పసివాడిలా ప్రవర్తించే వ్యక్తికి ఆధ్యాత్మిక జ్ఞానం సులువుగా లభిస్తుంది."

"కపటం లేని మనస్తత్వమే మనిషిని భగవంతుని వద్దకు సులభంగా చేరుస్తుంది."

"రాళ్ళు ఏరివేసి, చక్కగా దున్నిననేలలో విత్తనాలు చల్లితే అవి తేలికగా అంకురించి, పెరిగి, మంచి ఫలసాయాన్ని ఇస్తాయి. అలాగే కపటంలేని నిర్మల హృదయంలో ఆధ్యాత్మిక విషయాలు, సూక్తులు చక్కగా నాటుకొని ఫలవంతమవుతాయి.

"కపటం లేని మనస్తత్వం, ఉదార హృదయం గొప్ప తపస్సుకు మాత్రమే ప్రతిఫలంగా లభిస్తాయి. అటువంటి మనస్సుకల నిష్కపటులకే దేవుడు సాక్షాత్కరిస్తాడు.

"నీ మనస్సులోని భావాలకు అనుగుణంగా కపటం లేకుండా ప్రవర్తించాలి. నిర్మలహృదయంతో చేసే ప్రార్థనను భగవంతుడు తప్పకుండా వింటాడు."[7]

"నీవు ఏది సంకల్పిస్తావో, దానినే మాటలలో వ్యక్తం చేయాలి. నోటితో భగవంతుడే సర్వస్వమని చెబుతూ, హృదయంలో సంసారమే నీ సర్వస్వమని నమ్మితే దానివల్ల ఏమీ ప్రయోజనం ఉండదు."

## మానవతా విలువలు - వివేకం

"ఏనుగును స్వేచ్ఛగా వదలివేస్తే అది చెట్లను పెకలిస్తూ, నానాఅల్లరీ చేస్తుంది. కాని మావటివాడి అంకుశం పోటు దానిని శాంతింపజేస్తుంది. అలాగే మనస్సును యథేచ్ఛగా వదలివేస్తే అది గొంతెమ్మ కోరికలు కోరుతూ గొడవచేస్తుంది. కాని వివేకమనే అంకుశాన్ని ఉపయోగించి దానిని శాంతింపజేయవచ్చు."

## అహంకారం లేకపోవడం

"లోకాలకు వెలుగునిచ్చే సూర్యుడు మబ్బులు కమ్మినపుడు మనకు కనబడడు. అలాగే అహంకారం ఆవరించిన హృదయంలో భగవంతుడు ప్రకాశించలేడు."

- "అహంకారం ఉన్నంతవరకు ఆత్మజ్ఞానంగానీ, మోక్షంగానీ లభించవు."[8]
- "వెల్లుల్లిరసం పోసిన గిన్నెను ఎన్నిసార్లు కడిగినా ఆ వాసనపోదు. అలాగే అజ్ఞానంవల్ల కలిగే అహంకారం (తగిన విజ్ఞానం కలిగినప్పుడు తప్ప) ఎంత ప్రయత్నించినా పోదు."
- "పేరుప్రతిష్ఠలకై పాకులాడేవారు, అన్నీ తామే చేస్తున్నామనే భ్రమలో కొట్టుమిట్టాడుతుంటారు. ఆ సర్వేశ్వరుడే అన్నింటినీ నడిపే కర్త అని వారు గమనించలేక పోతున్నారు. కాని బుద్ధిమంతులయిన వారు, ఆ సర్వేశ్వరుడే అన్నింటికీ కర్త అనీ, అన్నింటినీ నడిపించేవాడనీ భావిస్తారు."
- "నీవు అహంకారాన్ని పూర్తిగా వదిలించుకోలేనని భావిస్తే, నిన్ను నీవు భగవంతుడి సేవకుడుగానో, పుత్రుడుగానో భావించుకొని గర్వపడడం వరకే అది పరిమితం కావాలి."
- "మహాత్ములైనవారు పసివారి స్వభావంతో ప్రవర్తిస్తారు. కాబట్టి వారికి అహంకారం ఉండదు. వారి బలమంతా భగవంతుడిచ్చినదే కానీ వారిది కాదు."
- "అంతా భగవంతుని ఇష్టానుసారం జరుగుతుందనే

గట్టినమ్మకం కలిగిన వ్యక్తి, తనను తాను ఈశ్వరుని చేతిలో పనిముట్టుగా మాత్రమే భావించుకొంటాడు. అటువంటి వ్యక్తి ఈ జన్మలోనే మోక్షాన్ని పొందుతాడు."

"పరమేశ్వరుని ఇష్టప్రకారమే అంతా జరుగుతుందని భావిస్తూ నిర్మలమయిన భక్తితో, కపటంలేని స్వభావంతో ఆ పరమేశ్వరుడికి తనను తాను సమర్పించుకొనే వ్యక్తి త్వరగా ఆ భగవంతుణ్ణి చూడగలడు."

## వివేక వైరాగ్యములు

"మనిషి వివేకవైరాగ్యములను అలవరచుకోవాలి. శాశ్వతమైనది ఏదో, తాత్కాలికమైనది ఏదో గ్రహించడమే వివేకం. ప్రాపంచిక సుఖాలపై ఆసక్తి లేకుండా ఉండడమే వైరాగ్యం. ఇవి హఠాత్తుగా లభించేవి కావు. ప్రతిదినం అభ్యాసం చేయడం ద్వారానే వాటిని పొందగలం. కామకాంచనాలను మొదట మానసికంగా వదిలిపెట్టాలి. భగవంతుని దయ ఉంటే, ఆ తరువాత భౌతికంగా కూడా వాటిని వదిలిపెట్టవచ్చు."

మిత్రమా! ఇప్పుడు నీవు పొందే అనుభూతిని నేను ఊహించగలను. ఆధ్యాత్మికస్ఫూర్తితో దైవసాక్షాత్కారం కోసం

ప్రయత్నించాలనే తపన నీలో మొదలైంది కదూ! అది ఎంతో మంచి పరిణామం, నేస్తం! కానీ, నీవు ఒక విషయాన్ని మాత్రం మరచిపోవద్దు. మనం దైవంకోసం చేసే సాధన చాలా కష్టాలతోనూ, సవాళ్ళతోనూ కూడుకొన్నది. ఏకాగ్రచిత్తంతో సాధనచేస్తే కానీ గమ్యాన్ని చేరలేము. ఈ సాధన విషయంలో శ్రీరామకృష్ణులు చెప్పిన అనేక విషయాలు నీకు తప్పక ఉపయోగపడతాయి.

## ఏకాగ్రత

"సూదిలో దారం ఎక్కించే ముందు విడివిడిగా ఉన్న దారపు పోగులను సరిచేసి, ఒకటిగా పేని, కొనదేలి ఉండేటట్లు చేస్తాం. అపుడు సులభంగా దారాన్ని సూదిలోకి ఎక్కించవచ్చు. అలాగే విచ్చలవిడిగా ఉండే కోరికలను తొలగించుకొని, అహంకారాన్ని విడిచిపెట్టి, వినమ్రతతో, ఏకాగ్రతతో మన మనస్సును భగవంతుని మీద లగ్నం చేయాలి."

## సాధన

"పిరికితనం, ద్వేషం, భయం ఉండేచోట భగవంతుడు ఉండడు."

☛ "వంశపారంపర్యంగా వ్యవసాయం చేసే రైతు పన్నెండేళ్ళు అనావృష్టి వచ్చినా తన వ్యవసాయాన్ని మానుకోడు. కానీ ఏ వర్తకుడో కొత్తగా వ్యవసాయం చేపడితే ఒక ఏటి కరవుకే బెంబేలెత్తి, 'ఇది మనకు అచ్చిరాదు!' అని మానుకొంటాడు. నిజమైన భక్తుడు జీవితమంతా భగవంతుని కోసం సాధన చేస్తూనే ఉంటాడు. ఆయన కనపడకపోయినా సాధన మానడు."

☛ "నిండుగా నీరున్న కుండను ఉట్టిపైన ఉంచితే కొంతకాలానికి ఆ నీరు ఇగిరిపోతుంది. కానీ ఆ కుండను నీటిలోనే ఉంచితే, అది ఎప్పుడూ నీటితో నిండుగానే ఉంటుంది. అలాగే కొంతకాలం ఆధ్యాత్మికసాధన చేసి, ఆ తరువాత ఆ విషయాన్నే మరిచిపోయి లౌకిక వ్యవహారాలలో మునిగిపోతే, నీ హృదయంలోని భక్తి హరించుకు పోతుంది. కానీ నీ హృదయాన్ని పవిత్రమైన భక్తి విశ్వాసాలు అనే అమృతంలో ముంచి ఉంచితే అది ఎల్లప్పుడూ పరిపూర్ణంగా ఉంటుంది."

☛ "లోతులేని చెరువు నుండి నీటిని త్రాగాల్సివస్తే పైభాగంలో ఉన్న నీటిని తీసుకోవాలి. చేతుల్ని నీటిలోనికి

ఎక్కువగా ముంచితే, క్రింద ఉన్న బురదతో నీరు కలుషితమై, త్రాగడానికి పనికిరాదు. అలాగే నీవు ఏ దోషంలేని పరిశుద్ధుడివి కాదలుచుకుంటే, నీ శక్తిసామర్థ్యాలను ఉపయోగంలేని ప్రసంగాలతోనూ, చర్చలతోనూ వృథా చేయక దృఢవిశ్వాసంతో సాధనలను కొనసాగించాలి.” [9]

- “పాలలో వెన్న ఉందని ఎంతగా అరచినా వెన్న లభించదు. తగిన ప్రయత్నం చేసినప్పుడు మాత్రమే అది లభిస్తుంది. అలాగే దేవుడిని ప్రత్యక్షంగా చూడదలిస్తే శ్రద్ధాభక్తులతో సాధన చేయాలి. అంతేకాని, కేవలం ‘దేవుడా, దేవుడా!’ అని అరిస్తే ప్రయోజనం ఉండదు.”

- “ధ్యానం, నామస్మరణం, సంకీర్తనం, ప్రార్థన, దానధర్మాలు, యజ్ఞయాగాలవంటి మంచిపనులు మనకు భగవంతుని అనుగ్రహాన్ని లభింపజేస్తాయి.”

- “ఆత్మసాక్షాత్కారం పొందాలంటే కఠోరసాధన చేయక తప్పదు. కాని పరిపూర్ణమైన శ్రద్ధ ఉంటే కొద్దిపాటి సాధనే సరిపోతుంది.”

- “సాధువులను, సాధుత్వాన్ని వెక్కిరించే వారి నుండి మనం దూరంగా ఉండాలి.”

"ఇతరులలోని తప్పొప్పులను విమర్శిస్తూ కాలం గడిపే వ్యక్తి జీవితం వ్యర్థం. ఎందుకంటే తనను తాను పరిశీలించుకోవాలన్న ఆలోచనకుగాని, పరమాత్మను గురించిన చింతనకుగాని అతడు తన జీవితంలో ఒక్క క్షణాన్ని కూడా కేటాయించడు."[10]

"అన్ని పనులనూ కట్టిపెట్టి సాయంకాలసమయంలో భగవంతుణ్ణి ధ్యానించాలి. సంధ్యా సమయంలో సహజంగా భగవంతుణ్ణి గురించిన ఆలోచనలు మనస్సును ఆవరిస్తాయి. 'ఇప్పటివరకూ ప్రపంచమంతా కంటికి కనబడుతూనే ఉన్నది. ఇంతలో అంతా చీకటిలో కలిసిపోయింది. ఇలా చేసేవారెవరు?' ఇటువంటి అనేకభావాలు ఆ సమయంలో తలెత్తుతాయి. సాయంకాలం మహమ్మదీయులు అన్నిపనులు కట్టిపెట్టి నమాజు చేయడం మనం చూస్తూనే ఉన్నాం కదా!"

శ్రీరామకృష్ణులు తన శిష్యులతో ఒకసారి ఇలా చెప్పారు: "నా సాధనల తొలిదశలో భగవంతుణ్ణి ధ్యానించడానికి ముందు, నేను చెడు ఆలోచనలు, కోరికల వంటి అనేక మలినాలను మనస్సు నుండి శుభ్రంగా కడిగి వేస్తున్నట్లు; ఆ తర్వాత దైవాన్ని మనస్సులో ప్రతిష్ఠిస్తున్నట్లు భావించేవాణ్ణి. మీరు కూడా అలాగే చేయండి."

☞ "సాధకుడు మొదట ఏకాంతప్రదేశంలో కూర్చొని ఏకాగ్రమైన మనస్సుతో సాధన చెయ్యడానికి ప్రయత్నించాలి. లేకపోతే అనవసరమైన అనేక విషయాలు మనస్సును కలవరపెడతాయి."

☞ "పాలలో నీరు కలిపితే ఆ రెండూ కలిసిపోతాయి. కాని ఆ పాలనుండి వచ్చిన పెరుగును చిలికి వెన్నగా మార్చి నీటిలో వేస్తే, అది నీటిలో కలవకుండా తేలుతుంది. అలాగే నిరంతరం సాధన చేసి మానసిక ఏకాగ్రతను సాధించిన మానవుడు ఎక్కడ ఉన్నా, పరిస్థితులకు లొంగిపోకుండా ఆధ్యాత్మిక భావాలను తనలో నిలుపుకొంటాడు."

☞ శ్రీగురుదేవులు తన శిష్యులకు ఒకసారి ఇలా చెప్పారు: "మీరు ధ్యానం చేయబోయేముందు నా శరీరాన్ని గురించి కొంతసేపు ఆలోచించండి. మీకు నామీదగల నమ్మకంవల్ల మీ ఆలోచనలు నావైపు త్రిప్పబడి, వెంటనే భగవంతుని మీదికి మీ దృష్టి మరలుతుంది."

☞ "ఏకాగ్రత సాధించడానికి మనస్సును దీపం మీద నిలపడం సులువైన పద్ధతి. దీపం మధ్యభాగంలో గల నీలిభాగం మీద మనస్సును నిలిపితే ఏకాగ్రతను త్వరగా పొందవచ్చు."

🙲 "ధ్యానం చేసే తొలిరోజుల్లో ధ్యానసమయంలో యోగనిద్ర అనబడే ఒక రకమైన నిద్ర సాధకుణ్ణి ఆవరిస్తుంది. అప్పుడతడికి కొన్ని దివ్యదృశ్యాలు తప్పకుండా కనబడతాయి."

🙲 "తీవ్రమైన ఏకాగ్రతతో మనస్సు ధ్యానంలో లగ్నమైనప్పుడు ఇతర విషయాలేవీ కనబడవు, వినబడవు. బాహ్యస్పర్శ ఉండదు. ఒంటిమీద పాములు పాకుతున్నా, తలపై పక్షులు గూళ్ళు కట్టుకొన్నా ఆ విషయాన్ని గమనించలేని స్థితిలో ఉన్న వ్యక్తియే ధ్యానంలో పరిపూర్ణత సాధించినవాడు. అతడే ధ్యానసిద్ధుడు."

🙲 "భగవత్సాక్షాత్కారానికి ఏ మార్గాన్ని అనుసరించినా మనస్సు పూర్తిగా స్వాధీనమయితే గానీ, యోగసిద్ధిని పొందలేము. యోగి మనస్సుకు లొంగకుండా, మనస్సునే ఎల్లప్పుడూ తన స్వాధీనంలో ఉంచుకోవాలి."

చూశావా మిత్రమా! ఇంతటి కఠినమైన సాధన, ఏకాగ్రతలతో శ్రమిస్తేగానీ భగవత్సాక్షాత్కారం లభించదు మరి! ఈ విషయాలలో అవగాహనలోపం వల్ల మనం కలవరపడుతూ ఉంటాము. అటువంటి సమయంలో

మహాపురుషుల బోధనలు ఎంతైనా ఉపకరిస్తాయి. కరుణామయుడైన ఆ భగవంతుడు తనను కోరికొలిచే భక్తులతో ఎలా దోబూచులాడతాడో, అదే సమయంలో ఎంతటి వాత్సల్యాన్ని చూపి ఆదరిస్తాడో శ్రీరామకృష్ణులు తమ పలుకులలో చక్కగా తెలిపారు.

## భగవంతుని మాయ, కృప

"పోలీసు తన దగ్గర ఉన్న దీపంతో ఎవరినైనా చూడగలడు. కానీ ఆ దీపాన్ని అతనివైపు త్రిప్పుకుంటేనే గాని ఇతరులు అతణ్ణి చూడలేరు. అదే విధంగా భగవంతుడు మనలనందరినీ చూస్తూనే ఉంటాడు. కాని మనమీద దయదలిచి సాక్షాత్కరిస్తే తప్ప మనం ఆయనను చూడలేము."

"సర్వేశ్వరుడు ఎంతో మహిమగలవాడు, అయినా మనఃపూర్వకంగా తనకు అర్పించబడే ఎటువంటి నైవేద్యాన్నైనా ఆనందంగా స్వీకరిస్తాడు."[11]

"భక్తుల ఇష్టాన్ని బట్టి ఒకే భగవంతుడు వేరువేరు రూపాలలో సాక్షాత్కరిస్తుంటాడు. ప్రతి భక్తుడు భగవంతుణ్ణి గురించి ప్రత్యేకమయిన భావాలను కలిగి ఉండవచ్చు.

వాటికి తగినట్లుగానే పూజిస్తూ ఉండవచ్చు. ఆయన కొందరికి యజమానిగానూ, కొందరికి తండ్రిగానూ, కొందరికి తల్లిగానూ, కొందరికి ప్రాణస్నేహితుడుగానూ, కొందరికి భర్తగానూ, కొందరికి విధేయుడైన కొడుకుగానూ భావించుకొనే అవకాశాన్ని కలుగజేస్తాడు."[12]

"ఒకే సూర్యరశ్మి భూమిమీద అనేక ప్రదేశాలలో పడుతున్నది. కానీ ఆ కాంతి అద్దంమీద కానీ, మెరుగు పెట్టిన లోహాలమీద కానీ, నీటిమీద కానీ పడినప్పుడే చక్కగా ప్రతిఫలిస్తుంది. అదే విధంగా భగవంతుని తేజస్సు అందరి హృదయాల మీద సమానంగా ప్రసరిస్తుంది. కానీ మంచివారు, సాధువులు మాత్రమే తమ నిర్మల హృదయాలతో ఆ తేజస్సును స్వీకరించి ఆ వెలుగును తిరిగి అందరికీ పంచగలుగుతారు."

"భగవంతుడు పంచదార కొండవంటివాడు. ఆ కొండ నుండి ఒక చిన్నచీమ ఒక చిన్నపలుకును తెచ్చుకోగలదు. పెద్దచీమ అయితే మరికొంత పెద్ద పలుకును తెచ్చుకోగలదు. కానీ ఆ కొండ తరిగిపోకుండా అలాగే ఉంటుంది. అదేవిధంగా భక్తులు కూడా దేవునికి ఉన్న అనేకగుణాలలోను, ఆకారాలలోను ఒక్కదానిచేతనే

బ్రహ్మానందాన్ని పొందుతారు. ఆయన ఆకారాలన్నింటినీ సాక్షాత్కరించుకోగలవారెవ్వరూ లేరు.”

అంతటి మహిమగల దైవాన్ని గురించి శ్రీరామకృష్ణులు తెలిపిన సూక్తులను మనమందరం శ్రద్ధగా చదివి, అర్థం చేసికొని, ఆచరణలో పెడితే ఈనాటి సమాజంలో నెలకొన్న మతమౌఢ్యం, సంకుచితభావాలు తొలగిపోతాయి. ఆ దైవం అందరివాడనే దివ్యభావాన్ని శ్రీరామకృష్ణులు స్పష్టంగా ఎలా తెలిపారో ఇక్కడ ఉదహరిస్తున్నాను.

## దేవుడు ఒక్కడే, పేర్లు అనేకం

“ఒకే నీటిని రకరకాలచోట్ల, రకరకాల పేర్లతో పిలుస్తారు. కొందరు ‘వాటర్’ అంటే కొందరు ‘వారీ’ అనీ, కొందరు ‘అక్వా’ అంటే కొందరు ‘పానీ’ అనీ అంటారు. అదే విధంగా ఒకడే అయిన సచ్చిదానంద పరబ్రహ్మను కొందరు ‘దేవుడ’నీ, కొందరు ‘అల్లా’ అనీ, కొందరు ‘హరి’ అనీ, కొందరు ‘బ్రహ్మమ’నీ పిలుస్తారు.” [12]

“కుమ్మరివాడి దుకాణంలో అందరికీ కావలసిన ఎన్నోరకాల ఆకారాలు, పరిమాణాలలో ఉన్న కూజాలు, మూకుళ్ళు, కుండలు మొదలైన వస్తువులు ఉంటాయి. కానీ, అవన్నీ ఒకే మట్టితో చేయబడినవి. అదే విధంగా

భగవంతుడు ఒక్కడే అయినా రకరకాల దేశకాలాలలో రకరకాల పేర్లతో పూజింపబడుతున్నాడు." [12]

"పెద్ద చెరువుకు చాలా రేవులు ఉంటాయి. మన అవసరాలకోసం ఏ రేవు నుంచి అయినా నీరు తీసుకోవచ్చు. ఒక రేవు మరొక రేవు కంటే గొప్పదని వాదించడం వల్ల ఏ ప్రయోజనం ఉండదు. అదే విధంగా బ్రహ్మానందమనే సరస్సుకు గల అనేక రేవుల్ని వివిధ మతాలుగా భావించవచ్చు. నిర్మలమైన హృదయంతో ఈ రేవులలో దేనిలో ప్రవేశించినా 'బ్రహ్మానందం' అనే నీటిని పొందవచ్చు. నా మతమే ఇతర మతాలకంటే గొప్పదని వాదించరాదు."

"భగవంతుడికి పేర్లు, రూపాలు ఎన్నో ఉన్నాయి. వీటిలో దేనిద్వారానైనా భగవంతుణ్ణి పొందవచ్చు. ఏ పేరుతో పిలిచినా, ఏ రూపాన్ని పూజించినా భగవంతుడి సాక్షాత్కారం లభిస్తుంది."

"వివిధ మత సాంప్రదాయాలన్నీ ఆ భగవంతుణ్ణి చేరడానికి వీలైన మార్గాలే. ఏ విధంగా కలకత్తా కాళీఘాట్‌లోని కాళికాలయాన్ని రకరకాల మార్గాల ద్వారా చేరుకోవచ్చునో, అలాగే వివిధ మతాలనే మార్గాలను ఉపయోగించి భగవంతుని నివాసాన్ని చేరవచ్చు."

ఒక భక్తుడి ప్రశ్న: "అన్ని మతాలవారు పూజించే దేవుడొక్కడే అయితే రకరకాల మతస్థులు ఆయనను రకరకాలుగా ఎందుకు వర్ణిస్తారు?"

జవాబు: "ఒక కుటుంబంలోని పెద్ద, ఒకరిచేత తండ్రిగానూ, ఒకరిచేత తమ్ముడుగానూ, ఒకరిచేత అన్నగానూ, ఒకరిచేత మామగానూ, ఒకరిచేత భర్తగానూ భావించబడతాడు. అదే విధంగా భక్తులు తమ భావాలనుబట్టి, దేవుణ్ణి రకరకాలుగా వర్ణిస్తారు. రూపాలు, పేర్లు ఎన్ని ఉన్నా దేవుడొక్కడే."

"దయ చూపడంలో క్రైస్తవుడిలాగా; ఆచారాలు, పట్టుదల విషయంలో మహమ్మదీయునిలాగా; అందరికీ మంచి చేసే విషయంలో హిందువులాగా; ప్రతిమనిషీ ప్రవర్తించటం అవసరం."

"అందరిపట్ల ప్రేమానురాగాలు కలిగి ఉండాలి. అందరితో కలిసిమెలిసి జీవించాలి. ఇతడు 'హిందువు', ఇతడు 'క్రైస్తవుడు', ఇతడు 'మహమ్మదీయుడు' అనే భేదభావాలతో ఇతరులను ద్వేషించకూడదు."

"లోకంలో రకరకాల స్వభావాలు కలిగినవారు ఉంటారని గ్రహించి, సాధ్యమైనంతవరకూ అందరితో కలిసి మెలసి జీవించాలి."[13]

"ప్రతివ్యక్తి తన మతధర్మాలను పాటించాలి. ఎవరి మతాన్ని వారు అనుసరించినట్లే ప్రతి హిందువు సనాతన ధర్మాన్ని పాటించడం మంచిది."

"జ్ఞానంపట్ల నిజమైన ఆసక్తిగల వ్యక్తి ఇతర మతాలను కూడా బ్రహ్మజ్ఞానాన్ని పొందటానికి ఉపయోగించే మార్గాలుగా భావిస్తాడు."

"నీ మతధర్మాలపట్ల పట్టుదలతో ఉండాలి కానీ నీ మతంపట్ల దురభిమానం, ఇతర మతాలపట్ల అయిష్టత ఉండకూడదు."[14]

"మనం ఎల్లప్పుడూ ఇతర మతాలపట్ల గౌరవ భావాన్ని కలిగి ఉండాలి."

ఇక చివరగా నీవు వ్రాసిన మరో విషయం గురించి ప్రస్తావిస్తాను. అందరిలోనూ, అంతటా భగవంతుడు ఉంటే అవినీతిపరులు, దుర్మార్గులు అయిన వ్యక్తులతో ఎలా ప్రవర్తించాలనే నీ సందేహానికి శ్రీగురుదేవులు చక్కటి సమాధానం ఇచ్చారు.

# దుర్మార్గులతో ఎలా వ్యవహరించాలి?

"పులిలో కూడా దేవుడు ఉంటాడు నిజమే! కాని మనం ఆ క్రూరజంతువుకు ఎదురుగా వెళ్ళి నిలబడవచ్చునా? అదే విధంగా పరమదుర్మార్గులలో కూడా భగవంతుడు ఉన్నప్పటికీ మనం వారితో స్నేహం చేయడం మంచిది కాదు."

"నీరు అంతా నారాయణ స్వరూపమే. కాని అన్ని రకాల నీళ్ళని మనం త్రాగడానికి వాడలేము కదా! ఒక రకం నీళ్ళు కాళ్ళు కడుగుకొనడానికి మాత్రమే ఉపయోగ పడతాయి. మరొక రకం నీరు స్నానానికి ఉపయోగ పడుతుంది. అదేవిధంగా భగవంతుడు అంతటా ఉన్నప్పటికీ అన్ని చోట్లకు మనం వెళ్ళకూడదు. కొన్ని ప్రదేశాలే చూడదగినవిగా ఉంటాయి. కొన్ని ప్రదేశాలు, మనం వాటి దగ్గరకు పోవడానికి కూడా వీలులేనివిగా ఉంటాయి."

"ఎప్పుడూ హద్దులేకుండా వృథాగా మాట్లాడుతూ ఉండేవారు, మనస్సులో కపటం కలిగినవారు, చెవులలో తులసిదళాలు పెట్టుకొని అందరిలో భక్తిని ప్రదర్శించాలని ప్రయత్నించేవారు - ఇటువంటి వ్యక్తుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి."

"సాధకులు ఎల్లప్పుడూ నిజం చెప్పాలి. కపటం లేకుండా ఉండాలి" అంటే అర్థం – మరీ వెఱ్రివారిలాగా ఉండటం కాదని చెపుతూ శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు – "నీవు భక్తుడివి కావాలిగానీ, బుద్ధిహీనుడివి కాకూడదు. నిజానిజాలను తెలిసికొంటూ, శాశ్వతమైనదేదో తాత్కాలికమైనదేదో గమనించుకొంటూ ఎల్లప్పుడూ విచక్షణతో ప్రవర్తించాలి. అశాశ్వతమైన ఈ ప్రపంచం మీదకంటే, శాశ్వతుడైన భగవంతుని మీద మనస్సును కేంద్రీకరించాలి."

శ్రీరామకృష్ణుల బోధనలలో ఎంత గొప్ప అర్థం ఉన్నదో అంత వాస్తవికత కూడా ఉన్నదని ఈసరికి నీవు గ్రహించే ఉంటావు.

నా ప్రియమైన నేస్తం! ఆ సర్వేశ్వరుణ్ణి చేరే వెలుగుదారిని చూపిన శ్రీరామకృష్ణ సందేశాన్ని మనందరం చదివి, అర్థం చేసికొని, ఆచరించాలి. అప్పుడే మన మానవ జన్మకు సార్థకత, ముందుతరాలవారికి ప్రశాంతమైన మనుగడ లభిస్తాయి.

గీతాచార్యుడైన శ్రీకృష్ణుని ఉద్బోధ విని, తన అజ్ఞానాన్ని తొలగించుకొని యుద్ధరంగంలో విజృంభించి, తన కర్తవ్యాన్ని నిర్వర్తించిన అర్జునుడిలాగా మనం కూడా శ్రీరామకృష్ణుల సందేశంతో సందేహనివృత్తి చేసికొని ఈ ప్రపంచమనే యుద్ధరంగంలో జీవితసమస్యలను ధైర్యంగా ఎదుర్కొంటూ, అదే సమయంలో 'తన మోక్షం కోసం, అందరి మంచి కోసం' పాటుపడుతూ, జీవుని సేవించడం ద్వారా ఆ పరమాత్ముని సేవచేస్తూ, మన పారమార్థిక సాధనలను కొనసాగిస్తూ, వరప్రసాదం లాంటి ఈ మానవజన్మను సార్థకం చేసికొందాము.

సర్వేజనాః సుఖినో భవంతు

ఓం శాంతిః శాంతిః శాంతిః

ఇట్లు,

నీ మిత్రుడు

## అంకెలతో సూచించబడిన బోధలను వివరించే 'ఒక కథ చెపుతా విను!' పుస్తకంలోని కథలు.

1. అంతా రాముని ఇష్టప్రకారమే జరుగుతుందని నమ్మిన సాలెవాని కథ.
2. ఆధునిక జనక మహారాజులు.
3. పనిమనిషి.
4. అటుకులు అమ్మే స్త్రీ.
5. భగవంతుడి కోసం ఉండవలసిన వ్యాకులత.
6. జటిలుని కథ; అర్చకుని కొడుకు-నైవేద్యం.
7. సాధువు - గొర్రెల కాపరి.
8. ఆవుదూడ-దాని కష్టాలు, దెయ్యము-వంకర వెంట్రుక.
9. పద్దయ్య దేవతార్చన.
10. సన్యాసి-వేశ్య.
11. యజమాని-సేవకుడు.
12. ఏక్ రామ్ - హజార్ నామ్.
13. పాము-సాధువు.
14. నూతిలో కప్ప.
15.